ప్రజాశక్తి

గురువారం 15 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

సిఎం హామీల అమలేది?

గతం కంటే భిన్నంగా పట్టించుకోని యంత్రాంగం - ప్రభుత్వమే నిధులు ఇవ్వడంలేదని అధికారుల అంతర్మథనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సిఎం వైఎస్ జగన్ జిల్లాలోని ఏ ప్రాంతంలో పర్యటించినా ఆ ప్రాంతంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారం కోసం హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఈ హామీల అమలుకు మాత్రం యంత్రాంగం కార్యచరణ రూపొందించడం లేదు. 1995 నుంచి సిఎం హామీలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కార్యచరణ రూపొందించి వెంటనే అమలుకు చర్యలు చేపట్టేది. 2019 వరకు ఇదే పద్ధతి కొనసాగింది. కానీ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత సిఎం జగన్ ఇస్తున్న అనేక హామీలు కార్యరూపం దాల్చడంలేదు. 2022 నుంచి ఇప్పటి వరకు సిఎం జగన్ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అనేక సమస్యలను సిఎం జగన్ ప్రముఖంగా ప్రస్తావించి హామీల వర్షం కురిపిస్తుంటారు. కానీ ఆచరణమాత్రం చాలా తక్కువవనేని చెప్పాలి.

2022 జనవరి ఒకటిన ప్రత్తిపాడు సభలో డబల్‌లైన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, పెదనందిపాడులో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం తదితర హామీలను ఇచ్చారు. ఇంతవరకు వీటిల్లో ఏదీ చేపట్టలేదు. గుంటూరు ఛానల్ విస్తరణ పనులు నేటికి ప్రారంభం కాలేదు. భూసేకరణ ప్రక్రియ పనులు ముందుకు సాగడం లేదు. 2022 నవంబరు 11న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన సభలో రూ.230 కోట్లతో భూగర్భ డ్రెయినేజి పనులను తిరిగి చేపడతామన్నారు. రూ.130 కోట్లతో శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ, ఆధునీకకీకరణ పనులు, ఆర్‌యూబిలను చేపడతామన్నారు. ఇంతవరకు కదలిక లేదు. తెనాలి సభలో కొల్లిపరలో మార్కెట్ యార్డు, తెనాలి-విజయవాడ రోడ్డు విస్తరణతోపాటు పలు హామీలను ఇచ్చారు. వీటిపైనా స్పందన లేదు. మాచర్ల, వినుకొండ, వలివేరు, బాపట్ల, నగరం, తదితర ప్రాంతాలలో జరిగిన సభల్లో కూడా ఇచ్చిన వరాలు మచ్చుకయినా ఆచరణలోకి రాలేదు. క్రోసూరులో శంకుస్థాపన చేసిన అమరావతి-బెల్లంకొండ రోడ్డు విస్తరణ పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. రాజధానిలోని వెంకటపాలెంలో 50వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తానని భరోసా ఇచ్చినా కోర్టు స్టే ఉత్తర్వులతో నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, విస్తరణకు సంబంధించి సిఎం జగన్‌కు ఎమ్మెల్యేలు బహిరంగ సభల్లో విన్నవించినా ఆయన హామీలు ఇచ్చినా ఆర్‌ఆండ్ బి శాఖకు నిధులు విడుదల కాకపోవడం వల్ల సిఎం హామీలు అమలు కావడం లేదని అధికారవర్గాలు తెలిపాయి. మాచర్లలో సిఎం జగన్ ఇటీవల శంకుస్థాపన చేసిన వరికపూడిశెల పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. ఈ అంశంపై ఇప్పటికే ప్రతిపక్షపార్టీలు నిరసనలు తెలియజేస్తున్నాయి.

ప్రచారంలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు

రేపటి బంద్, సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో బుధవారం ప్రచారం చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నాటి హామీలను విస్మరించిన బిజెపి మొత్తంగా దేశ ప్రజలను మోసం చేసిందని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ మొదలుకొని వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, ఎల్ఐసి, బ్యాంకులను తదితర సంస్థలను అదాని, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టడానికి పూనుకుందని, కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందని మండిపడ్డారు. ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని కాపాడాల్సి ఉండగా ఆ రంగాన్ని కూడా కార్పొరేటీకరించేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఐక్యమై నష్టదాయకమైన ఈ విధానాలను తిప్పికొట్టాలని, అందులో భాగంగా జరిగే బంద్, సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దె దింపాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.రామారావు, డి.శివకుమారి, టి.పెద్దిరాజు, సిలార్ మసూద్, కె.రాంబాబు, యు.రంగయ్య, వి.వెంకట్, షేక్ చిన్నజాను సైదా, కె.శ్రీను పాల్గొన్నారు.

నేడు రేపూడికి సిఎం రాక

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వాలంటీర్ల పురస్కారాల ప్రదాన సభకు హాజరుకానున్న ముఖ్యమంత్రి

తాడికొండ నియోజకవర్గమైన ఫిరంగిపురం మండలం రేపూడిలో గురువారం మధ్యాహ్నం జరిగే 'వాలంటీర్లకు వందనం' సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. సంక్షేమ పథకాల అమలులో కీలకభూమిక పోషిస్తున్న వాలంటీర్లను ప్రోత్సహిస్తూ వరసగా నాల్గో ఏడాది చేపడుతున్న కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిరంగిపురం మండలం రేపూడిలో ఏర్పాటు చేశారు. ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7 రోజులపాటు జరిగే ఈ పురస్కారాలకు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎస్పీ

సిఎం శ్రీకారం చుట్టనున్నారు. సేవావజ్ర మెడల్ కింద ఇప్పటి వరకు ఇస్తున్న రూ.30 వేల నగదు పురస్కారాన్ని రూ.45 వేలకు, సేవారత్న

▸ 2లో

ఏడు ప్రాంతాల్లో వైద్యశిబిరాలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలోని శారదా కాలని, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో ప్రజల అనారోగ్య సమస్యల పరిష్కారానికి 7 ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు, తాగునీటి నమూనాలు, ఇంటింటి సర్వే చేపట్టామని, ప్రజలు భయాందోళనలకు గురవ్వొద్దని, ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే మెడికల్ క్యాంప్‌లో సంప్రదించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి సూచించారు. శారదా కాలనిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లను కమిషనర్ బుధవారం పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. నగరంలో కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్న శారదాకాలనీ 9వ లైన్‌లోని 150వ

మెడికల్ క్యాంప్‌లతో వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్

వార్డు సచివాలయంలో, 4వ లైన్‌లోని అభయాంజనేయస్వామి కళ్యాణ మండపం,

▸ 2లో

గుంటూరులో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, జెఎసి నాయకులు



పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఉద్యోగులు, నాయకుల నిరసన

ఎపి జెఎసి ఉద్యమం ప్రారంభం

సమస్యలను పరిష్కరించాలని పలుచోట్ల నిరసన - నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు - గుంటూరులో కలెక్టర్, పల్నాడు జిల్లాలో అధికారులకు వినతులు

వార్తలు లోపలి పేజీల్లో

గుంటూరు లోక్‌సభకు టిడిపి అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి టిడిపి అభ్యర్థిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఖరారయ్యారు. తెనాలి మండలం బుర్రిపాలేనికి చెందిన చంద్రశేఖర్ తండ్రి వ్యాపార రిత్యా నర్సరావుపేటలో స్థిరపడ్డారు. చంద్రశేఖర్ 1993-94లో ఎంబిబిఎస్ ఎంట్రన్స్‌లో ర్యాంకు సాధించి హైదరాబాద్ ఉస్మానియాలో సీటు సాధించారు. తరువాత మెడికల్‌లో పీజీ చేసేందుకు అమెరికా వెళ్లారు. అమెరికాలో వైద్య వృత్తిని కొనసాగిస్తూనే పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అమెరికాలో వైద్య విద్య అధ్యాపకుడిగా, ఫిజిషియన్‌గా పని చేశారు. పేద విద్యార్థుల కోసం యూ వరల్డ్ ఆన్‌లైన్ శిక్షణా సంస్థను ప్రారంభించారు. నర్సింగ్, ఫార్మసీ, న్యాయ, వాణిజ్యం, అకౌంటింగ్ విభాగాల్లో సైతం అమెరికాలో లైసెన్సింగ్ పరీక్షలకు శిక్షణ ఏర్పాటు చేశారు. అమెరికా ఫీజిషియన్ అసోసియేషన్‌లో సభ్యులుగా పలు సేవలందించారు. పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా ఉచితవైద్య సేవలు

▸ 2లో

నేడు రేపూడికి సిఎం రాక

(మొదటి పేజీ తరువాయి)

కింద రూ.20 వేల నుంచి రూ.30 వేలకు సేవామిత్ర కింద ఇచ్చే మొత్తాన్ని రూ.10 వేల నుండి రూ.15 వేలకు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా 2,55,464 మందికి రూ.392.05 కోట్ల నగదు పురస్కారాలు అందించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన 997 మంది వాలంటీర్లకు ప్రత్యేకంగా నగదు బహుమతులు.. ఒక్కో వాలంటీర్‌కు మండల, పట్టణ, మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో రూ.15 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేల చొప్పున మొత్తం రూ.1.61 కోట్ల నగదు బహుమతుల ప్రదానం చేయనున్నారు. 'సేవ వజ్ర' ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన మొదటి ఐదుగురు వాలంటీర్లకు 175 నియోజకవర్గాలలో 875 మంది వాలంటీర్లకు పురస్కారాల ప్రదానం జరగనుంది. 'సేవారత్న' ద్వారా ప్రతి మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు చొప్పున, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 10 మంది చొప్పున టాప్ 1 ర్యాంకు సాధించిన వాలంటీర్లకు, మొత్తంగా 4,150 మందికి ఈ పురస్కారాల ప్రదానం జరగనుంది.

సిఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.సుచరితతో కలసి పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. హెలీప్యాడ్, సభా స్థలి ఏర్పాట్లు, బారీకేడ్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సూచనలు చేశారు. తాగునీరు అందుబాటులో వుంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పి తుషార్ దూడి పరిశీలించారు. కాన్వాయ్ ట్రైల్‌రన్ నిర్వహించారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

గుంటూరు లోక్‌సభకు టిడిపి అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్

(మొదటి పేజీ తరువాయి)

అందించారు. వైద్య బీమా లేక ఇబ్బందులు పడుతున్న ప్రవాస భారతీయులకు అండగా నిలిచారు. పల్నాడు ప్రాంతంలో ప్రజల తాగునీటి సమస్యలను తెలుసుకున్న ఆయన 120 బోర్‌వెల్స్, ఆర్‌వో ప్లాంట్స్ ఏర్పాటు చేశారు. తెనాలి మండలం బుర్రిపాలెంలోనూ ఉచిత ఆర్‌వో ప్లాంటు నెలకొల్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ కింద విద్యా సేవలు అందిస్తున్న పలు సంస్థలకు సాయం అందించారు. 2014లోనే టిడిపి నుంచి నర్సరావుపేట లోక్‌సభ టిక్కెట్ కోసం ప్రయత్నించారు. 2014, 2019లో మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావుకు అవకాశం ఇవ్వడంతో ఆయన కొంత కాలం వేచి ఉన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో గుంటూరు నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. మంగళగిరి జనసేనపార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను చంద్రశేఖర్ మంగళవారం రాత్రి కలిసి పలు అంశాలపై చర్చించారు. జనసేన, టిడిపి సమన్వయంతో పనిచేస్తాయని చంద్రశేఖర్‌కు పవన్ భరోసా ఇచ్చారు.

రైతు భరోసా కేంద్రంలో టీవీ చోరీ

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని అంగలూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో టీవీ ని (52 అంగుళాల) మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బుధవారం ఉదయాన్నే కార్యాలయానికి వచ్చిన వ్యవసాయ విస్తరణాధికారి అప్పారావు తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి లోపలకు వెళ్లి చూడగా టీవీ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మండల వ్యవసాయ అధికారి ఆర్ రామారావు ,పోలీసులు చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపటి బంద్ జయప్రదం కోసం బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త పిలుపు మేరకు శుక్రవారం జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పట్టణంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రైతు సంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని అన్నారు. రైతు ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినా వాటిని మరో రూపంలో అమలు చేయజూస్తోందని మండిపడ్డారు. బిజెపి పాలనలో లక్షన్నర మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, వివిధ సంఘాల నాయకులు పి.మహేష్, కె.శివదుర్గారావు, పి.ప్రభాకర్, ఎ.వీరబ్రహ్మం, జి.రజిని, జి.ఉమశ్రీ, సిహెచ్ లక్ష్మీనారాయణ, బి.వెంకటనారాయణ, వి.తులసి, జె.రాజకుమార్, పి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడకుంటే తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వివిధ సంఘాలు, పార్టీల నాయకులు హెచ్చరించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వై.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాల మోపటంలో ప్రపంచ రికార్డు నెలకొల్పిందని, పెట్టుబడుదారులకు కార్పెట్లు పరుస్తూ, పేదలపై భారాలు వేస్తోందని విమర్శించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం సిఫార్సు చేసిన స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి ఆయన సిఫార్సులకు తిలోదకాలిచ్చిందని ఎద్దేవ చేశారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ ప్రజల సొమ్ముతో నిర్మించిన అనేక ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధి కీలక పాత్ర పోషించడమే కాకుండా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారని, వాటిని పెట్టుబడిదారులకు మోడీ ప్రభుత్వం తెగనమ్ముతోందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు బాబురావు, సిటియు నాయకులు అబ్రహం లింకన్, బీఎస్పీ నాయకులు సైదులు యాదవ్, సిఐటియు నాయకులు బి.మహేష్, వై.సురేష్, వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరు, చందవరం, తూబాడు, కనపర్రు, ఎండుగుంపాలెం, నాదెండ్లలో ప్రచారం చేశారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సీ2 ప్లస్ 50 శాతం మద్దతు ధర చట్టం చేయాలని, రైతుల రుణమాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం తేవాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

బంద్, సమ్మె జయప్రదం కోసం రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని జానపాడు, గుత్తికొండ, జూలకల్లు, పందిటివారిపాలెం గ్రామాల్లో ప్రచారం చేశారు. సిఐటియ మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎస్కే సర్దార్, కె.సీతారామయ్య, జి.నాగేశ్వరరావు, ఒ.నరసింహారావు, బాలరాజు, వెంకయ్య, సిహెచ్.ఆంజనేయులు, గఫూర్ పాల్గొన్నారు.

అంగన్వాడీల కుటుంబాలకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - నరసరావుపేట

చనిపోయిన అంగన్వాడి వర్కర్స్,హెల్పర్స్‌కి ప్రభుత్వం మట్టి ఖర్చులకు రూ.20 వేల బీమా, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్న హామీలు అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి డిమాండ్ చేశారు. జిల్లాలో ఇద్దరు అంగన్వాడీ వర్కర్స్, ఒక హెల్పర్ చనిపోయారని నరసరావుపేటలోని పీడీ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. దుర్గి మండలం ముటుకూరు సెక్టార్‌లో పనిచేసే రిషిబాయి డిసెంబర్ 8వ తేదీన సరుకుల కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారని, శావల్యపురం మండలం కారుమంచి సెక్టార్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్ జ్యోతి ప్రసన్న అనారోగ్యంతో జనవరి 24న మరణించారని, ములకలూరు మండల విరుగుపాలెం సెక్టార్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ హెల్పర్ పాలూరి రాణి ఫిబ్రవరి 13వ చనిపోయారని వివరించారు. వీరందరికీ ప్రభుత్వం వెంటనే హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిలార్ మసూద్ పాల్గొన్నారు.

ముప్పాళ్లలో టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని బుధవారం సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను తరిమికొట్టేందుకు టిడిపి, జనసేన కూటమి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి రాష్ట్ర సంపదను దోచుకోవడం తప్ప దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, ఎస్.వెంకటరావు,దేవేంద్ర రావు కె.జార్జ్,మనోజ్, మధుబాబు,మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి మాబుసుభాని, మైనారిటీ సెల్ అధ్యక్షుడు లీలాఫర్ ఖాన్,చిన్న సీతారామయ్య,కాశీం,హకీం,కష్ణ, మోలాలి,పోలిశెట్టి రామారావు పాల్గొన్నారు.

నేటి తరానికి నవలా సాహిత్యం విలువలు తెలియాలి

ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో రెండ్రోజుల జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆధునిక సమాజానికి నవల సాహిత్యంపై కనీస అవగాహన ఉండేవిధంగా రచనలు రావాల్సిన అవసరం ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ పి.వరప్రసాదమూర్తి అన్నారు. వర్సిటీలోని తెలుగు ప్రాచ్య భాషా విభాగంలో 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం–సామాజిక చైతన్యం' అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సదస్సుకు విభాగాధిపతి ప్రొఫెసర్ ఇ.మాధవి అధ్యక్షత వహించగా రెక్టార్ మాట్లాడుతూ మారుతున్న ఆధునిక సమాజానికి, నవలా సాహిత్యంపై కనీస అవగాహన ఉండేవిధంగా అర్థమయ్యే రీతిలో పాఠకులను ఆలోచింపచేసే విధంగా రచనలు ఉండాలని సూచించారు. సమకాలీన పరిస్థితులకు వర్తమాన అంశాలకు అనుగుణంగా రచనలు చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందన్నారు. కీలకోపన్యసకులుగా పాల్గొన్న బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ బూదాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు నవల ఆవిర్భావం, వికాసం, ఆధునిక కాలంలో నవలా సాహిత్యం ప్రాధాన్యాన్ని విశ్లేశించారు. నేటి తరానికి నవలా సాహిత్య పఠనం వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించారు. సంస్కృత అకాడమీ సంచాలకులు ప్రొఫెసర్ కె.నీలకంఠం మాట్లాడుతూ సంస్కృత నవలా లక్షణాలను, సంస్కృత సాహిత్యంలో ఆధునిక ప్రక్రియమైన నవలా సాహిత్యాన్ని, ఇతర సంస్కృత నవలల గురించి వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. స్వరూపారాణి, ప్రొఫెసర్ ఎన్.వి.కష్ణారావు, డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ పవన్, డాక్టర్ పి.వాసు, డాక్టర్ లలితకుమారి, డాక్టర్ బలరాం పాల్గొన్నారు.

మాట్లాడుతూన్న బూదాటి వెంకటేశ్వర్లు

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	1,04,737
మిర్చి ఎగుమతి	:	1,16,434
మిర్చి నిల్వ	:	90,110

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 20,500
నెం.5	10,000 - 21,000
273	12,000 - 17,500
341	10,500 - 21,000
4884	14,000 - 17,500
సూపర్ 10	15,000- 15,200
	నాన్ ఏసి
తేజ	8,000 - 22,000
బడిగి	9,500 - 22,000
దేవనూరు డీలక్స్	9,500 - 21,000
తాలుకాయలు	5,000 -13,000

భృగుబండ విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక

కలెక్టర్ నుండి ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి అభిషేక్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

భృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి తయారు చేసిన ఆటోమాటిక్ సిగ్నల్ ఇండికేటర్స్ ఆన్ హిల్ టర్న్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. నర్సరావు పేట లో జిల్లా స్థాయిలో బుధవారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన లో భృగు బండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 10వ తరగతి చదువు తున్న ఐ.అభిషేక్ తయారు చేసిన ప్రాజెక్టును ప్రదర్శించారు. పల్నాడు జిల్లాలోని వివిధ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన 126 నమూనా ప్రదర్శనలను ప్రదర్శించారు. వీటిలో విభిన్నంగా ,శాస్త్రీయంగా ఉన్న 13 నమూనాలు చిత్తూరు లో జరగనున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వీటిలో అభిషేక్ తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్ నుండి అభిషేక్ ప్రశంసా పత్రం అందుకున్నారు.

ఉత్తమ ప్రమాదరహిత డ్రైవర్ ముస్తఫా

ప్రజాశక్తి - వినుకొండ : ఉత్తమ ప్రమా దరహిత డ్రైవర్లుగా విధులు నిర్వహించిన డ్రైవర్లకు బుధవారం నగదు బహుమతి అందజేశారు. వరుసగా 4వ సారి బహుమతి అందుకున్న ఎస్కే ముస్తఫా, బి.గోవింద నాయక్‌లకు నగదు బహుమతి అందజేశారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక ఆర్టీసీడిపోలో ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ బి. కోటేశ్వర నాయక్, గ్యారేజీ ఇంచార్జ్ సుగ్రీవ నాయక్, ప్రభుత్వ వైద్యులు షేక్ అబ్దుల్ రజాక్ హాజరయ్యారు.

'విశ్వసాయి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ: అల్ ఇండియా స్థాయిలో జేఈఈ మెయిన్స్-2024 ఫలితాలలో వినుకొండ విశ్వసాయి జూని యర్ కళాశాల విద్యార్థులు విజయం సాధించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లీ పావని బుధవారం తెలి పారు. కె.విజయదుర్గ 97 శాతం, వి.సీతారామ శర్మ 92 శాతం, ఆర్. రాజేంద్ర 89శాతం, వై. అమృతవర్షిణి 77 శాతం, బి. లెల్లి సరోన్ 68 శాతం సాధించారని చెప్పారు.

In The Court of The Senior Civil Judge : Kavali

E.P.No. 2 / 2023

N.O.S.No.656/2010

Between :
N. Soujanya - D.Hr
Vs
V.Narayanamma and others - J.Drs

Notice

To
JDR1. Smt **Virigineni Narayanamma,** W/o Late **Kondaiah,**
JDR2. **Virigineni Tirupathi Naidu** @ **Shambabu,** S/o Late **Kondaiah,**
JDR3. **Virigineni Rambabu,** S/o Late **Kondaiah,** JDR 1 to 3 are residents of Flat No.304, Brundavanam residency, Chandramouli Nagar, Gunturu. అను వారికి

ఈ నెంబరున డి.హెచ్.ఆర్ మీపై ఇ.పి. దాఖలు చేసియున్నందుకు మీకు నోటీసు నిమిత్తం నిమిత్తం **తే12-03-2024** దికి వాయిదా వేయబడి యున్నది. ఆదినము పగలు **10.30 గంటలకు** పై కోర్టు వారి యెదుట మీరు హాజరై అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు ఎక్సపార్టీగా తీర్మానించబడును.

యన్.యస్.కిరణ్ కుమార్
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది, కావలి.

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

I.A. No. 648/2023 in OS No. 218/2017

బిట్వీన్
Bhavirisetty Venkata Satyanarayana
.... పిటీషనర్ / వాది
ఎదిరి
Kota Lakshmi Satyanarayana (died)
and others .... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు
To,
R4 : Kota Padmini, D/o Kota Lakshmi Satyanarayana.
R5 : Kota Lakshmi Sai Rupini, D/o Kota Lakshmi Satyanarayana,
Both are R/o Door No. 18-5-2, Up stairs, Gorre Venkatappaiah Street, Salipet, Tenali.

పై నెంబరు దావాలో I.A. No. 648/2023 పిటీషన్‌లో మిమ్ములను వారసులుగా చేర్పించమని సదరు కోర్టులో పిటీషన్ దాఖలు చేసియున్నందున మీ హాజరు నిమిత్తం ది. 20-2-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 20-2-2024

కె.గురునాధంబాబు,
పిటీషనర్ / వాది తరపు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 9182313919

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P.NO.6/2023

పఠాన్ తహెర మరియు 2 ఇతరులు .... పిటీషనర్స్
మరియు
షేక్ బిబి జాన్ మరియు 3 ఇతరులు ..రెస్పాండెంట్స్
To
R2) షేక్ ఇబ్రహీం
S/o లేట్ షేక్ మహబూబ్,
నివాసం : గుజ్జనగుండ్ల,
హెయిర్ కంపెనీ పంపిణీదారుడు, గుంటూరు.

పై నెంబరు గల పిటీషన్ లో కోర్టు వారు మీకు అనేక పర్యాయములు నోటీసు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం తేది.21-02-2024 నకు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ అక్షేపణలు తెలియపరచు కొనవలెను. లేని యెడల మీ పరోక్షముగా విచారించి తీర్మానించ బడునని తెలియచేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
తేది 18-12-2023
స్థలం: ఒంగోలు. **ఇట్లు**

యస్.రవికుమార్
న్యాయవాది, చాంబర్ నెం.2,
న్యాయవాది సదన్,
జిల్లా కోర్టు ప్రాంగణము,ఒంగోలు
సెల్ : 9550126957.

మహారాజశ్రీ ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఒంగోలు

OS NO : 37/2022

చిడిపోతు స్వాతి మరియు ఒకరు ...వాదులు
మరియు
అంగలకుర్తి నారాయణమ్మ మరియు ఒకరు
... ప్రతివాదులు
To
D2) నాగినేని పద్మావతి
భర్త శ్రీనివాసరావు, డోర్ నెంబర్ 129,
అంకిరెడ్డిపాలెం, గుంటూరు, గుంటూరు జిల్లా.

పై నెంబరు గల దావా లో మీ హాజరు నిమిత్తం అనేక పర్యాయములు సమన్లు పంపినప్పటికీ మీరు సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు తేది : 06-03-2024న ఉదయం 10:30కి శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరు కావలసిందిగా ఆదేశించి నందున మీరు సదరు వాయిదా రోజున హాజరుకాని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని తెలియ చేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
ఆళ్ళ హరిబాబు
ఆళ్ళ రవిచంద్ర
అడ్వకేట్స్, ఒంగోలు
సెల్ : 9848510650
8886237590

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సత్తెనపల్లి

I.A 882/23 in O.S 28/22

Between:-
పాములపాటి శ్రీనివాసరావు మరియు 3 గురు
...వాదులు/పిటిషనర్లు
And
చేవూరి సుబ్బారెడ్డి మరియు ఇద్దరు
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To,
రెస్పాండెంట్ నెం.1:- చేవూరి సుబ్బారెడ్డి
S/o సుబ్బరామి రెడ్డి, డోరు నెం.14-13-18,
వీవర్స్ కాలనీ, నిడుబ్రోలు, పొన్నూరు.

పైన పేర్కొన పిటిషనులో గౌరవనీయులైన కోర్టువారు మీకు నోటీసులు పలుమార్లు ఇచ్చినప్పటికినీ మీరు తీసుకోకపోయినందున, పేపరు ప్రకటన ద్వారా 31-01-2024 న నోటీసు ఆర్డరు చేసియున్నారు. మీరు స్వయంగా కాని లేదా ప్లీడరు ద్వారా పైన పేర్కొన కోర్టులో ది:18-03-2024 న ఉదయం 10-30 ని॥లకు మీరు హాజరు కావల్సియున్నది. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానం చేయబడుతుందని తెలియ చేయటమైనది.
వాయిదా తేది:18-03-2024

కె.వరప్రసాద్,
పిటిషనరు తరపు అడ్వకేట్.
గుంటూరు, సెల్ నెం.7893862499.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : MANGALAGIRI

I.A. 1019/2016 I.A. 1981/2015
F.D.I.A 538/2015 in OS. 58/2009

Between :
Dogiparthi Siva Mohan Rao ....Petitioner
And
Sunitaraj Arora .... Respondent
To,
Sunitaraj Arora, W/o. Surendra Kumar Arora, R/o. Seethanagaram, Tadepalli Mandal, Guntur District.

పై నెంబరు I.A.ను I.A. No.1981/2015 పిటీషన్ రిస్టోర్ చేయమని దాఖలు చేయగా సదరు పిటీషన్‌లో రెస్పాండెంట్‌కు నోటీసు నిమిత్తం వాయిదా 28-2-2024 తేదీకి వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టు ఎదుట మీరు హాజరై మీకు గల అక్షేపణలు తెలియపరచు కోవలెను. లేనియెడల మీ పరోక్షమున పై కేసు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయటం అయినది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదాతేది :28-02-2024

జి.సీతారామిరెడ్డి,
పిటీషనర్ తరపు న్యాయవాది,
గుంటూరు.

TENALI MUNICIPALITY

E-procurement Short & Re-call Tender Notice

EPTC NIT No. Short Tender Notice No.23 & 17/2023-24/General fund and Re-call NIT No.23,21,20,18,16,15,14,13, 12,11,08/2023-2024/ GGMP, 15th FC Grant & General fund & NIT No.23/2022-23/ General fund Online tenders are hereby invited from the contractors/contracting agencies for no of Short & Re-call tender Works :41 for Est Amount Rs.323.67 Lakhs. The tender document is available for download from Dt: 15-02-2024 (4.00pm) onwards and last date for bid submission for short tenders is Dt:22-02-2024 (4.30pm) and for Re-call tenders is Dt:29-02-2024 (4.30pm) through Further details can be seen at 'e' procurement market Place i.e., "www.apeprocurement.gov.in".

Sd/- COMMISSIONER
TENALI MUNICIPALITY

18న 'చలో విజయవాడ'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్: ఈ నెల 18న జరిగే 'చలో విజయవాడ ' కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఎంపిసిపిఎస్ఈఎ రాష్ట్ర కౌన్సిలర్ గార్లపాటి సునీల్ పిలుపు నిచ్చారు. సత్తెనపల్లి ఎన్జీఓ హోమ్ లో బుధవారం 'చలో విజయవాడ' వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సిపిఎస్, జిపి ఎస్ విదానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధా నాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతుల పొలాల పరిశీలన

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని చీమలమర్రిలో నూజివీడు కంపెనీకి చెందిన విన్నర్ రకం మొక్కజొన్న విత్తనాలు నాటిన రైతుల పొలాలను పిడుగు రాళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు, మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధి కారులు మాట్లాడుతూ విన్నర్ మొక్కజొన్న రకం విత్తనాలు నాటిన రైతులు గింజ సరిగ్గా పాలు పోసుకోలేదని, తాము నష్టపోయామని రైతులు ఫిర్యాదు చేయడంతో పరిశీలించామని తెలి పారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు శాస్త్ర వేత్తలకు దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ నెల15వ తేదీ నాటికి ఈ క్రాఫ్ బుకింగ్ నమోదు నమోదు చేసుకోవాలన్నారు. కార్య క్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జగదీష్, రైతులు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST. JUDGE::GUNTUR
M.V.O.P.No: 101 / 2022

Between:
Upparapalli Srinivasa Rao ... Petitioner
And
Devarapalli Jesu Kumar & Others
...Respondents
To,
R-2: Gangolu Rajani Kantha Kumari, W/o.Vemula Rambabu, R/o.Flat No:109, Samsthitha Apartments, Opp.Hosanna Mandir, Gorantla,Guntur Dist. (Owner of the Car Bearing No:AP 39 EZ 8906)

పై నెంబరు O.P. ని పిటీషనర్ యాక్సిడెంటులో తగిలిన గాయములకు నష్టపరిహారము కోరుచు పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్ లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:27-02-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:27-02-2024

కేసానుపల్లి శ్రీరామసుబ్బారావు,
పిటీషనర్ తరపు అడ్వకేట్,
6/4 అరండల్ పేట, గుంటూరు.
సెల్: 9866003212

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయాయి

పల్నాడు జిల్లా నకరికల్లు మండలం నకరికల్లు గ్రామానికి చెందిన తలపల దుర్గా రామకృష్ణ తండ్రి పోలురాజుకు చెందిన 10వ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్ పోయింది. 2011 మార్చి నకరికల్లు గ్రామంలోని వంగా వెంకట్ రెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో రోల్ నెంబర్ 1114132805 మార్క్ లిస్ట్ ఇల్లు మారేటప్పుడు మార్గమధ్యంలో పోయినది. ఎవరికైనా దొరికిన యెడల కింది చిరునామాకు తెలియపర్చగలరు.

బహిరంగ ప్రకటన

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, కృష్ణలంక, బ్రహ్మరాంబపురం, డోర్ నెం: 41-21/1-22 కాపురస్తులు లేటు. కుంచా పెద్ద రాఘవయ్య గారి కుమారుడు కుంచా వెంకట మోహన రావు, వయస్సు 80 సం.లు గారి ద్వార సంజాయిషి పొందిన పిమ్మట యావన్మందికి తెలియజేయునది ఏమనగా
నా క్లయింట్ అయిన కుంచా వెంకట మోహనరావు గారికి వారి భార్య గారు అయిన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, కృష్ణ లంక, బ్రహ్మరాంబపురం, డోర్ నెం: 41-21/1-22 నివాసి కుంచా వెంకట మోహనరావు భార్య కుంచా వెంకట రత్నం గారు ది.27-06-2019 తేదిన S.R.O పటమట నందు ఒక వీలునామా రిజిస్టార్ కాబడినది. సదరు వీలునామా రిజిస్ట్రర్ నెం BK III 187/2019 తేది. 27-06-2019 న రిజిస్ట్రార్ కాబడినది. అయితే ఇటీవల నా క్లయింట్ యొక్క భార్య కుంచా వెంకట రత్నం గారు ది.17-10-2023 న విజయవాడ లో చనిపోయినారు.
నా క్లయింట్ యొక్క భార్య చనిపోయినందున వీలునామాలో వ్రాసి రిజిస్ట్రార్ కాబడిన ఆస్థి నా క్లయింట్ నకు సంక్రమించి తదాది నుండి నేటి వరకు సదరు స్థిరాస్తిని నా క్లయింట్ సర్వసంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో నిర్వివాదముగా అనుభవించు చున్నది. సదరు సంక్రమించిన భూమిని వెబ్ ల్యాండ్, అడంగల్ నందు మరియు రెవిన్యూ రికార్డు లో పేరు నమోదు చేసుకొనుటకుగాను శ్రీ మంగళగిరి తహసిల్దార్ వారికీ మరియు శ్రీ తాడేపల్లి తహసిల్దార్ గార్లకు అర్జీలు దాఖలు చేసియున్నారు.
షెడ్యూలు:- నా క్లయింట్ అయిన కుంచా వెంకట మోహనరావు స్వాధీన పరచుకొని సమస్త హక్కులతో అనుభవించుచున్న చినకాకాని గ్రామా పంచాయతి గ్రామా డి.నెం. 143-1A లోయ 0.3450 సెంట్లు భూమికి హద్దులు:-
తూర్పు: మాణిక్యాల నాగేశ్వరమ్మగారి భూమిహద్దు
దక్షిణం: మాణిక్యాల సాంబయ్యగారి భూమి హద్దు
పడమర: లింగినేని సుబ్బారావు హద్దు
ఉత్తరం : మర్రి సుబ్బారావు గారి భూమి హద్దు
ఈ హద్దుల మధ్య య 0.3450 సెంట్లు శేరి మెరక భూమి మాత్రమే.
షెడ్యూలు:- నా క్లయింట్ అయిన కుంచా వెంకట మోహనరావు స్వాధీన పరచుకొని సమస్త హక్కులతో అనుభవించుచున్న తాడేపల్లి మండలం, ఉండవల్లి గ్రామా పంచాయతి గ్రామా డి.నెం.111 లోయ 0.30 సెంట్లు భూమికి హద్దులు:- తూర్పు: శిగిరిశెట్టి చైనా అమ్మయ్య గారి భూమి హద్దు దక్షిణం: బోడె కాలువ హద్దు పడమర: గాదె కౌసల్యమ్మ హద్దు
ఉత్తరం : రోడ్డు హద్దు
ఈ హద్దుల మధ్య య 0.30 సెంట్లు శేరి మెరక భూమి మాత్రమే.
ఈ ఆస్థి గురించి ఎవరికైన ఏ విధమైన క్లెయిమ్లు గాని, అభ్యంతరములు వగైరాలు గాని, వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోగ నాకు గాని, శ్రీ మంగళగిరి తహసిల్దార్ వారికీ మరియు శ్రీ తాడేపల్లి తహసిల్దార్ గార్లకు గాని, లికిత పుర్వంగా తెలియజేయ వలసిందిగా కోరటమైనది. గడువు లోపల ఎటువంటి అభ్యంతరాలు రాని యెడల షెడ్యూల్ ఆస్థి నిష్పేచి అస్తిగా భావించి కుంచా వెంకట మోహన రావు అను నా క్లయింట్ యొక్క పేరును నమోదు చేయబడును అని ఇందుమూలంగా తెలియజేయుటమైనది.
మంగళగిరి,
తారీఖు :14-02-2024

బుల్లా చందు, B.Tech, B.L.
బుల్లా రమేష్ బాబు, B.A., L.L.B.
అడ్వకేట్ & నోటరి,
గవర్నమెంట్ అఫ్ ఆంధ్రప్రదేశ్
డోర్ నెం: 5-517, రాజీవ్ సెంటర్,
మంగళగిరి, గుంటూరు జిల్లా,
ఫోన్ : 9394076578

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హామీలపై జీవోల కోసం ధర్నా

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై సత్వరమే జీవోలిచ్చి అమలు చేయాలని కార్మికులు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న సబ్బులు, నూనెలు, యూనిఫామ్, చెప్పులు వెంటనే ఇవ్వాలని, పనిముట్లను రిపేర్ చేయించాలని, పెండింగ్లో వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు నైపుణ్యాన్ని బట్టి వేతనాలు పెంచాలన్నారు. వీటిపై ఈనెల 20వ తేదీ లోపు జీవోలు ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు కె.సీతారామయ్య, కె.కొండలు, మార్తమ్మ, పద్మ, కె.వెంకటేశ్వర్లు, కె.ఎల్లమంద, కె.శ్రీను, కె.సాగర్‌బాబు, కె.మేరమ్మ, జి.నాగేశ్వరరావు, సుజాత, పి.సురేంద్ర పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం బొల్లాపల్లి మండలంలో పర్యటించారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. రేమిడిచర్లలో లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పంచాయతీ కార్యాలయంలో పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. నెట్‌వర్క్ సమస్యల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందగించడం గుర్తించి సమస్య పరిష్కారానికి ఎంపిడిఒ విజయ్‌కుమార్, తహశీల్దార్ బివి రమణరావు, ఇఒపిఆర్‌డి జిలాని బాషాను ఆదేశించారు. ఇంటర్నెట్ సౌకర్యం తక్కువగా ఉన్నచోట వెంటనే అవసరమైన చర్యలు చేపట్టి రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలన్నారు.

33 మంది ఈశ్వర్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజీలో అల్ సెక్ టెక్నాలజీస్ కంపెనీ చేపట్టిన ప్రాంగణ ఎంపికల్లో 173 విద్యార్థులు పాల్గొనగా వీరిలో 33 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎంపికైన వారికి రూ.2.40 లక్షలు వార్షిక వేతనం ఉంటుందన్నారు. మరిన్ని క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని అవకాశాలను విద్యార్థులు అందిపిచ్చుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్.ఖరీమ్ మొహిద్దీన్ కోరారు. ఉద్యోగాలు పొందిన వారిని కళాశాల చైర్మన్ షేక్ మీరావాలి, ప్లేస్మెంట్ ఆఫీసర్ షేక్ ముజీర్, అధ్యాపకులు అభినందించారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా రేపు బంద్



వినుకొండలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-వినుకొండ

కేంద్రంలోని బిజెపి అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 16న చేపట్టే గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. గోపాలరావు మాట్లాడుతూ ప్రజలపై తీవ్ర భారాలు వేస్తున్న ప్రభుత్వాలు మరోవైపు కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయని అన్నారు. ఎన్నికల నాటి హామీలను విస్మరించిన మోడీ ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. వ్యవసాయాన్ని, రైతును కాపడుకోవడానికి స్వామినాథన్ కమిషన్ ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కులు చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించేలా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టానికి తగినంతగా నిధులు కేటాయించాలని, ఏడాదికి 200 పనిదినాలతోపాటు రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై చేపట్టే ఆందోళనల్లో అన్ని రంగాల ప్రజలు భాగస్వామం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రసన్న లక్ష్మి, సీతారామయ్య, రంజాన్ బి, నాసర్ బి, శ్రీదేవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల మండలంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

బంద్ జయప్రదం కోసం మండలంలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలో ఆటో ప్రచారం నిర్వహించారు. రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ మాట్లాడారు. నాయకులు జి.జాలయ్య, ఎన్.సాంబశివరావు, టి.అమరలింగేశ్వరరావు, పి.సైదా ఖాన్, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, సిహెచ్.వెంకటాద్రి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళపై కానిస్టేబుల్ లైంగిక వేధింపులు దుర్మార్గం

నిందితుణ్ణి సత్వరమే సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలి : సిపిఎం

నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- దాచేపల్లి

భర్త కేసు విషయమై వెళ్లిన మహిళను కానిస్టేబుల్ లైంగికంగా వేధిండం, దీనిపై బాధితురాలు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా వారు చర్యలు తీసుకోపోవడం దారుణమైన విషయమని సిపిఎం విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రమైన దాచేపల్లిలో బుధవారం నిరసన తెలిపారు. మహిళ ఇంటికి పురుషుడైన కానిస్టేబుల్‌ను విచారణకు పంపించడం వల్ల లైంగిక వేధింపులకు ఆస్కారం ఏర్పడిందని, ఒంటరిగా లేదా బలహీనంగా ఉన్న మహిళలపై ఇంటికి వరి వచ్చి మరి పోలీస్ కానిస్టేబుల్ ఆఘాయిత్యాలకు పాల్పడడం సిగ్గుమాలిన చర్యని విమర్శించారు. ఒంటరి మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న అకృత్యాలకు ఇదొక నిదర్శనమని, అరికట్టాల్సిన పోలీసులు సరిగా స్పందించడం లేదనేది తాజా ఘటన ద్వారా స్పష్టమవుతోందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, నిందితుడైన పోలీస్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయడంతోపాటు అతన్ని విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తున్నామని, దిశ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని ప్రభుత్వాలు చెబుతున్నా మహిళల భద్రత ఇంకా అందని ద్రాక్షగానే ఉందని, తాజా కేసులో బాధితురాలికి న్యాయం చేయకుంటే ప్రజా సంఘాలు, ఇతర పార్టీలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆంజనేయరాజు, నాయకులు పి.కృష్ణ, మంగారావు, జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు జైభారత్ విద్యార్థి ప్రాజెక్టు

ప్రజాశక్తి-క్రోసూరు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో క్రోసూరులోని జైభారత్ స్కూల్ విద్యార్థిని నమూనా రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ప్రదర్శనకు మొత్తంగా 126 పాఠశాలల విద్యార్థులు హాజరవగా 13 నమూనాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వాటిలో జై భారత్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి షేక్ రయ్యాన్ రూపొందించిన వీడింగ్ మిషన్ ఎన్ఐవి రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నుండి రయ్యాన్ అభినందనలతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. రయ్యాన్‌తోపాటు గైడ్‌గా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులను స్కూల్ డైరెక్టర్ టి.జైనేంద్రారెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎపి జెఎసి తాలూకా యూనిట్ చైర్మన్ పెండెం మణిరావు డిమాండ్ చేశారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ పెండెం మణిరావు మాట్లాడుతూ ఉద్యోగులు పెట్టుకున్న జిపిఎఫ్ ఎపి జిఎల్ఐ, లోన్ వెంటనే మంజూరు చేయాయని, సరెండర్ లీవులు తాలూకా జీతం చెల్లించాలని, ఉద్యోగుల హెల్త్ కార్డ్సతో నగదు రహిత వైద్యంవ అందించాలని కోరారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగుల పెర్మినెంట్ పక్రియ త్వరగా చేయాలని. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఎపి ఎన్జీవో కార్యదర్శి అంబేద్కర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఖాసీం, డిఇసి మెంబెర్ ప్రదీప్ కుమార్, ఈసీ మెంబెర్ వెస్లీ పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. పిడుగురాళ్ల తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షులు దామెర్ల పట్టాభి, సెక్రటరీ అప్పారావు, కోశాధికారి సాగర్‌బాబు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు శేషగిరిరావు, కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.వి చలపతిరావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం సభ్యులు ఓబులు, శివ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్‌కు ఏపీ జేఏసీ నాయకులు బుధవారం అందజేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఉద్యోగులు జీవన ప్రమాణాలు కష్టంగా మారాయని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో



విలీనం చేసినా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉపాధ్యాయుల అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. జెఎసి ఉద్యోగులు రవికుమార్, రామారావు, డి.సుబ్రహ్మణ్య ప్రసాద్, రవికుమార్, హైమావతి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ, సిఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా ఎఆర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి.మహాత్మాగాంధీరెడ్డి, సత్తెనపల్లి రూరల్ సిఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం.రాజేష్ కుమార్ బుధవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపటి గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ బందు, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని నూతక్కి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌కి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ డాక్టర్ స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తానని రైతాంగానికి హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల వలసలు నివారించేందుకు వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వల్లూరి భారతి, డివైఎఫ్ఐ నాయకులు సుగుణ కుమార్ పాల్గొన్నారు. గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎం కాలేజీ వద్ద బస్ డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు ప్రసంగించారు.

ప్రజాశక్తి - పెదకాకాని :16న అఖిలభారత రవాణా కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా బందు పిలుపులో భాగంగా పెదకాకాని శంకర్ కంటి హాస్పిటల్ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా సిఐటియు అధ్యక్షులు బి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేయాలని, యాక్సిడెంట్లకి డ్రైవర్లను బాధ్యులను చేస్తూ 10 సంవత్సరాలు జైలు శిక్ష , రూ. 10 లక్షల జరిమానా విధించాలని తీసుకువచ్చిన చట్టం సరైనది కాదని తక్షణమే చట్టాన్ని రద్దు చేయాలని తదితర సమస్యల పరిష్కారానికి 16న బంద్ జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో శంకర్ కంటి హాస్పిటల్ ఆటో వర్కర్స్ వి యేసు, పూర్ణ రెడ్డి , పి శ్రీనివాసరావు, ఏ హరిబాబు, పి కిరణ్, కె నాగేశ్వరరావు జి సతీష్ తదితరులు పాల్గొన్నారు **ప్రజాశక్తి - తుళ్లూరు:** 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్య రాజు కోరారు. అసెంబ్లీ పారిశుధ్య కార్మికుల సంఘం విస్తృత సమావేశం బుధవారం రాజధాని ప్రాంతం మల్కాపురంలో జరిగింది. **ప్రజాశక్తి-తెనాలిరూరల్ :** 16న జరిగే గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. పారిశ్రామిక సమ్మెలో రైతులు, కార్మికులు పాల్గొనాలని బుర్రిపాలెంలో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నడపాల దుర్గాప్రసాద్, కటిక శ్రీకాంత్, తోట నాగేశ్వరరావు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా పాలసీ మొత్తం రైతులకే చెల్లిస్తాం

శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్ అధినేత శ్యామ్ మహేశ్వరి

ప్రజాశక్తి దుగ్గిరాల

రూ.40 కోట్లకు బీమా చేశామని, వచ్చిన పాలసీ మొత్తాన్ని నష్టపోయిన రైతులకు చెల్లిస్తామని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అధినేత శ్యామ్ మహేశ్వరి తెలిపారు. గత నెల 19వ తేదీన కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదానికి గురైన నప్పుడు జరిగిన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన అనంతరం బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంత మొత్తంలో పసుపు నిల్వ ఉన్నది చెప్పలేదని రైతులు బాధపడుతున్నారని, రికార్డులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, అడిగినా ఇవ్వలేదని చెప్పారు. పాలసీ మొత్తం చెల్లించమని న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీని కోరామని, బీమా కంపెనీ వారు అంచనా వేయమని వేరే ఏజన్సీకి అప్పచెప్పారని తెలిపారు. కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం జరిగి దాదాపుగా 24 సంవత్సరాలు అవుతుందని, అప్పటినుండి ఇటువంటి సంఘటనలు జరగలేదని, ప్రస్తుత సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని శాఖలతో చేపట్టిన విచారణను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు.

డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన రమేష్

ప్రజాశక్తి తెనాలి

తెనాలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా బుధవారం ఎ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇప్పటివరకు డిఎస్‌పిగా బాధ్యతలు నిర్వహించిన బి జనార్ధనరావు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ఏసిపి-1(ట్రాఫిక్)గా బదిలీకాగా, ఆయన స్థానంలో మైలవరం డిఎస్పీగా పనిచేస్తున్న ఎం రమేష్ తెనాలికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన డిఎస్పీని సబ్ డివిజన్ పరిధిలోని పలువురు సిఐలు, ఎస్ఐలు, కార్యాలయం సిబ్బంది స్వాగతించారు.

ఎపి జెఎసి ఉద్యమం ప్రారంభం

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన - కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. తాలూకాలలో మండల రెవెన్యూ అధికారుల సమస్యలపై మెమోరాండ్రం అందచేశారు. అలాగే గుంటూరులో జిల్లా కలెక్టర్‌కు ఉద్యోగులు వినతిపత్రం అందచేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి జెఎసి జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.21 వేల కోట్ల బకాయిలను తక్షణం చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 12వ పి.ఆర్.సి కమిటీ వేసినప్పటికీ ఇంతవరకు కార్యాచరణ నిమిత్తం సిబ్బందిని కూడా ఇవ్వలేదని, తక్షణం సిబ్బందిని కేటాయించి తాత్కాలిక భతి మంజూరు చేయాలని కోరినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఏపీ జేఏసీ కన్వీనర్ శెట్టిపల్లి సతీష్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఏ.శ్యాంసుందర్, కూరాకుల శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివ జ్యోతి, ఏపీ ఎన్జీ జీవో నగర అధ్యక్షులు ఎస్.పి.ఎస్.సూరి, కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, విజయ్‌బాబు, విజయలక్ష్మి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే నరసింహారెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్షులు బసవలింగారావు, ఖజానా శాఖ అధ్యక్షులు అలీ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి తెనాలి:**రాష్ట్రంలో ఉద్యోగులు ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తెనాలి యూనిట్ అధ్యక్షులు, ఏపీ జెఎసి నాయకులు డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ నాయకులు విద్యాసాగర్ రావు, సూర్య ప్రకాష్ రావు, జి సుబ్బారావు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మంగళగిరి:**ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. **ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :** జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తాసిల్దార్ కు మెమొరాండం అందజేసారు.

మంగళగిరిలో

నన్నపనేని రాజకుమారిని కలిసిన చంద్రశేఖర్

ప్రజాశక్తి - తెనాలి

తెలుగుదేశం పార్టీ నుంచి గుంటూరు ఎంపీగా రానున్న ఎన్నికలలో పోటీ చేస్తారని ప్రచారంలో ఉన్న పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం తెనాలి వచ్చారు. అయితా నగర్ లోని రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి నివాసానికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. కొంతసేపు వారి మధ్య రాజకీయ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే వారి భేటీలో ప్రత్యేకత ఏమీ లేదని, తెనాలి వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చిన చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా మాత్రమే కలిసినట్లు రాజకుమారి వెల్లడించారు. కార్యక్రమంలో నన్నపనేని ముకుందరావు, రాజ కుమారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఏటుకూరు జగనన్న కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న కాలనీలలో అన్ని మౌలిక సదుపాయాలూ కల్పిస్తామని నగర మేయర్ కావటి మనోహర్ నాయడు తెలిపారు.బుధవారం ఏటుకూరు లోని జగనన్న కాలనీలో, రెడ్డిపాలెంలో నూతనంగా ఏ.పి.సి.పి.డి.సి.యల్ నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సొంత గృహాలు లేని ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలను మంజూరు చేసి, గృహాలను నిర్మిస్తున్నారన్నారన్నారు. ఈ సందర్భంగా ఏటుకూరులో ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో గృహాలు నిర్మించటం పూర్తి కావస్తున్నందున, సదరు ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి ప్రత్యేకంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించారన్నారు. అంతేకాక ప్రతి లేఔట్‌లో కూడా అవసరమైన మౌలిక్ సదుపాయాలను కల్పించటం జరుగుతుందన్నారు. రెడ్డిపాలెం శివారు కాలనీల ప్రజల కోసం సబ్ స్టేషన్‌ను ప్రారంభించుట జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏ.పి.సి.పి.డి.సి. యల్ ఈ.ఈ లు తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, సి.హెచ్. వెంకటేశ్వరరావు, యం. శ్రీనివాసరావు, సుబ్బారాయుడు, ప్రసాదరావు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి పూర్ణచంద్రరావు : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రమించిన పేదల పక్షపాతి కెవి పూర్ణచంద్రరావు అని , సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివ శంకరరావు అన్నారు. బుధవారం రాత్రి ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం లో, మసీదు సెంటర్ వద్ద కె.వి పూర్ణచంద్ర రావు విగ్రహం వద్ద ఆయన 14వ వర్ధంతి కార్యక్రమం కెవిపిఎస్ నాయకులు నల్లపు కిషోర్ బాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా పూర్ణచంద్రరావు విగ్రహానికి సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కామ్రేడ్ అధికారి నాగేశ్వరరావు, స్తూపానికి సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్య పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ శంకరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం, కొలనుకొండ, కుంచనపల్లి తదితర గ్రామాలలో సర్పంచులుగా పనిచేసిన సిపిఎం నాయకుల గెలుపుకు విశేషంగా పూర్ణచంద్ర రావు కృషి చేశారని అన్నారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి మండల ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు, కార్మికులు, దళితుల, మహిళల సమస్యల పైన నిరంతరం కృషి చేసేవారని ఆయన అన్నారు. ఆర్ఎంపీ వైద్యులుగా పేదలకు వైద్యం చేసే పూర్ణచంద్రరావు ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధి కోసం విశేష కృషి చేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం గ్రామ మాజీ సర్పంచ్ వడ్డేశ్వరం బిక్షాలు, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.కె పాపాసాహెబ్, సిపిఎం నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు, గుడిసె శ్రీనివాసరావు, మధిర శ్యామ్, లటికే కోటేశ్వరరావు, దేవదానం, ఎస్ కే వహీదుల్లా తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని సామ్రాజ్యం కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు తాడే కోరు వెంకటేశ్వర్లు సతీమణి తాడేకోరు సామ్రాజ్యం (92) వయోభారంతో బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులు ఉన్నారు. ఆమె పెద్ద కుమార్తె కాట్రగడ్డ నాగేశ్వరమ్మ, అల్లుడు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య కొలనుకొండ గ్రామ సర్పంచులుగా పని చేసి ఉన్నారు. సామ్రాజ్యం మృతి వార్త తెలుసుకున్న సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్రాజ్యం కుమారులు తాడే కోరు ఏసుబాబు చిర్రావూరి గ్రామ సిపిఎం కార్యదర్శిగా కొంతకాలం పనిచేశారు. మరో ఇద్దరు కుమారులలో తాడే కోరు కొండయ్య సిపిఎం శాఖ సభ్యులుగా ఉన్నారు. నివాళులర్పించిన వారిలో మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు దొంతి రెడ్డి శ్రీనివాస కుమారి, సిపిఎం కొలనుకొండ గ్రామ శాఖ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ , కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

సామ్రాజ్యం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

నెహ్రూనికేతన్‌కు ఒలింపియాడ్‌లో ర్యాంకులు

ప్రజాశక్తి-తెనాలి :జాతీయస్థాయి ఒలింపియాడ్‌లో నెహ్రూ నికేతన్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. స్థానిక బోస్ రోడ్డులోని విద్యాసంస్థల ఆవరణలో మేనేజింగ్ డైరెక్టర్ మురళికాంత్ దాసరి బుధవారం ఆ వివరాలను తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ గతేడాది డిసెంబర్లో ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ పేరుతో జాతీయస్థాయిలో ఒలింపియాడ్ నిర్వహించారని, ఆ పోటీల్లో నెహ్రూనికేతన్ విద్యార్థులు సిహెచ్ జయ శ్రీనివాస్ రాష్ట్రస్థాయిలో 20 ర్యాంక్, షేక్ సుమయ్య 25, కె మోక్షిత్ సాయి 113 ర్యాంకులు సాధించార న్నారు. అలాగే ఆరుగురు విద్యార్థులు బంగారు పతకాలను, ఇద్దరు రజత, మరొకరు కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారన్నారు. సిల్వర్ జోన్ ఫౌండేషన్ పంపిన మెడల్స్, ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేసి అభినందించారు.

పల్నాడు కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పుల్లారావు

సహకార వ్యవస్థ బలోపేతంతోనే మేలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తే సహకా ర బ్యాంకులు తిరుగులేని విజయాలు సాధిస్తాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక కృష్ణారెడ్డి డొంకలో నూతనముగా పల్నాడు కోపరేటివ్ సొసైటీ బ్యాంక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు,రక్షణ, అవసరాలకు అక్కర కు రావడంతో సహకార వ్యవస్థను మించిందేది లేదని అన్నారు. పల్నాడు కో- అపరేటివ్ బ్యాంక్ మేనేజ్ శ్రీనివాసరావు మాట్లాడుతు డిపాజిట్లపై 12 శాతం వడ్డీ ఇస్తున్నటు చెప్పారు. బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కె రఫాని పాల్గొన్నారు.

కంటిచూపు సామర్థ్య పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డ్రైవర్‌కు కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ హేమ శ్రీ

వాహన చోదకులు తరచూ కంటి చూపు సామర్థ్యం పరీక్షలు చేయించు కోవాలని ప్రభుత్వ నేత్ర వైద్యురాలు డాక్టర్ హేమశ్రీ సూచిచారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రం నరసరావుపేటలోని అయ్యప్ప స్వామి గుడి వద్ద ట్రాన్స్పోర్ట్ వాహనాల డ్రైవ ర్లకు వాహన యజమానులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రత ఎన్.జి.ఓ సంస్థ ప్రెసిడెంట్ ఆర్.కె దుర్గ పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరంలో వాహనచోదకులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు డ్రైవింగ్ చేసేవారు తప్పనిసరిగా కంటి పరీక్ష చేయించుకోవాలని, తగిన కళ్ల జోళ్లు వాడితే దృష్టి సరిగ్గా ఉంటుందని హేమశ్రీ సూచించారు. రోడ్డు సేఫ్టీ ఎన్‌జిఒ సంస్థ స్వచ్ఛందంగా కంటి పరీక్షలు నిర్వహించడంపై లారీ అసోసియేషన్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమలో రోడ్డు భద్రత అధికారిణి పద్మజ, ఎన్‌జిఒ సభ్యులు బంగారయ్య, సుబ్బారావు, సాంబశివరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో నిరాహారదీక్షలు చేస్తున్న న్యాయవాదులు

నష్టం కలిగించే భూ హక్కు చట్టాన్ని రద్దు చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చిన్న సన్నకారు రైతులకు ప్రజలకు నష్టం కలిగించే భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య డిమాండ్ చేశారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహాం దీక్షలు బుధవారం నాటికి ఆరో రోజుకు చేరాయి. నిరహరదీక్షల శిబిరాన్ని సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య ప్రారంబించారు. న్యాయవాదులు పొత్తూరి హరి మణికంత, గుర్రం పవన్ కుమార్, ఆకుల నాగార్జున,తేజ నిరహరదీక్షల్లో పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిలాగా ఎప్పటికప్పుడు విషయాలను అవగాహన చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ.శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం నరసరావుపేటలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టంట్ ప్రిసైడింగ్ అధికారుల (నియోజక వర్గ మాస్టర్ ట్రైనర్లు) శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఎన్నిక ల కమిషన్ ఆదేశాలపై అవగాహన పెంచు కోవాలని, ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోవాలన్నారు. వచ్చిన సందేహాలను పైఅధికారులను అడిగి ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవా లని సూచించారు. ఎన్నికల విధులలో జాగ్రత్త అవసరమని అన్నారు. ఎన్నికల కమిషన్ నూతనంగా ప్రవేశపెట్టిన హోమ్ ఓటింగ్‌పై, పోస్టల్ ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందురోజు, ఎన్నికల రోజు, ఎన్నికల తదుపరి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.వినాయకం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రతి నెలా 14 వ తేదీన నిర్వహించే నవోదయం కార్యక్రమాన్ని నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా అధికారులు, నవోదయం నోడల్ ఆఫీసర్ సంజీవరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి. వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో గణపతి పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నుండి 110 మంది వివిధ రకాల బ్యాంక్ రుణాలకు , ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.'నవోదయం'లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి నిర్వహిస్తున్న మినీ జాబ్ మేళా కు 39 మంది హాజరు కాగా అందులో 17 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. 'నవోదయం' లబ్ధిదారులు వెనిగండ్లకు చెందిన బి.లక్ష్మయ్య, పిడుగురాళ్లకు చెందిన ఎ. దానమ్మలకు బ్యాంకు రుణాల ద్వారా కార్లు పంపిణి చేశారు.

'నవోదయం'లబ్ధిదారులకు వాహన తాళాలు అందజేస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

దార్శనికుడు దామోదరం సంజీవయ్య

ఆంధ్రదేశానికి గొప్ప దార్శనికుడు దేశభక్తుడు బహుముఖ ప్రజ్ఞాశాలి దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ శివ శంకర్ అన్నారు. దామోదరం సంజీవయ్య 103 వ జయంతి సందర్భంగా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేటి తరం రాజకీయ నాయకులు సంజీ వయ్య జీవిత చరిత్రను తప్పనిసరిగా తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి లోతేటి వరలక్ష్మి , నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ సంజీవరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు 9 మంది పల్నాడు విద్యార్థులు ఎంపిక కావడంపై కలెక్టర్ శివశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరస రావుపేట కలెక్టరేట్‌లో విద్యార్థులను అభినందించారు. నరసరావుపేట మండలంలోని కాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,నరసరావుపేట బాలుర మున్సిపల్ హైస్కూలు లకు చెందిన 9 మంది విద్యార్థులు ఈనెల 19 నుండి 23 వరకు హర్యానా రాష్ట్రంలో జరగనున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపికయ్యారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొనే సువర్ణ అవకాశాన్ని పల్నాడు జిల్లా విద్యార్థులు కైవసం చేసు కున్నారు. విద్యార్థులన అభినందించిన వారిలో పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఆర్. గోవిందరాజులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు టి.అంజిరెడ్డి, వి. రాంబాబు న్నారు. జాతీయ స్థాయిలో జరిగే క్యాంపులో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొనే స్కౌట్స్ దిగ్విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

కలెక్టర్‌తో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపికైన విద్యార్థులు

ఎంపీపీగా సంపూర్ణమ్మ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - రెంటచింతల

సంపూర్ణమ్మను అభినందిస్తున్న వెంకట్రామిరెడ్డి తదితరులు

మండల పరిషత్ అధ్యక్షురాలుగా పాలనా పగ్గాలు చేపట్టిన పాముల సంపూర్ణమ్మ మండలాన్ని అభివృద్ధి పదంలో నడపాలని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కోరారు బుధవారం ఎంపిపీగా సంపూర్ణమ్మ చేత ఎంపీడీవో శంకరరావు పదవి స్వీకార ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా ఎదగడానికి వివిధ అంశాలపై అవగాహన ఏర్ప రచుకోవడానికి స్థానిక సంస్థలు దోహదపడతా యన్నారు. ఇప్పటిదాకా ఎంపీపీగా వ్యవహరించిన దాసరి చౌడేశ్వరి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ ఎస్. నర్సిరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ జి. బ్రహ్మారెడ్డి , ఎన్.భాస్కర్‌రెడ్డి,ఉమామహేశ్వర్‌రెడ్డి ప్రతాప్ రెడ్డి సర్పంచ్ పి.చౌడమ్మ, మాజీ సర్పంచ్ పి.రామయ్య పాల్గొన్నారు.

మాచర్లలో టిడిపి-జనసేన ర్యాలీ

ప్రజాశక్తి - మాచర్ల

తెలుగుదేశం పార్టీలో పలువురు నాయకుల చేరిక సందర్భంగా మాచర్లలో టిడిపి-జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ బహిరంగ సభ జరిగింది. స్థానిక శ్రీశైలం రోడ్ లోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నుండి ర్యాలీ ప్రారంభమై ప్రధాన రహదారి ద్వారా గుంటూరు రోడ్డులోని మిర్చి యార్డు సమీపంలోని బహిరంగ సభ వేదిక వరకు ఈ ర్యాలీ కొనసాగింది. మాచర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి వెల్దుర్తి మండల నాయకులు కుర్రి శివనాగిరెడ్డి, పార్టీలో చేరుతున్న ఎనుముల కేశవరెడ్డి, విద్యాధరణ మురళి, మాజీ కౌన్సిలర్ లెనిన్ బాబు, జనసేన అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదు లు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ శరత్ బాబా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు

పత్రిక విలేకరిపై దాడికి సిపిఎం ఖండన

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి 'ఈనాడు' విలేకరి పరమేశ్వరరావుపై జరిగిన దాడిని మండల సిపిఎం కార్యదర్శి బి.సూరిబాబు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారికంగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న అధికార పార్టీ,ప్రజా సంపదని దోచేస్తున్న నేపథ్యంలో, ప్రజాస్వామ్యంలో అవినీతి అక్రమాలను కలం ద్వారా వెలుగులోకి తీసుకొచ్చి,ప్రజలకు తెలియపరుస్తున్న గ్రామీణ విలేకరులపై,భూ ఇసుక బకాసురులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. అమరావతిలోని 30 పడకలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరమేశ్వరావును సూరిబాబు, సయ్యద్ మొహుద్దీన్ వలి తదితరులు పరామర్శించారు. భవిష్యత్తులో జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నించే వారిపైన అధికార పార్టీ నాయకులు దాడులు అరికట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను సూరిబాబు కోరారు. **ప్రజాశక్తి-బెల్లంకొండ:** విలేకరులపై అధికార పార్టీ నాయకులు దాడులు చేయటం సిగ్గుచేటని బెల్లంకొండ టిడిపి నాయకుడు, సర్పంచ్ గడ్డిపర్తి జ్యోతి సముద్రం అన్నారు. అక్రమ ఇసుక క్వారీ పై ఫోటోలు తీయడానికి వెళ్లిన పరమేశ్వర రావుపై వైసిపి నాయకులు దాడిని ఖండించారు. ప్రతి పాత్రి కేయుడు రాసే రాతలు అవినీతిపరుల గుండెల్లో పిడుగులా మారాలని అన్నారు.

టిడిపి నుంచి వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-బెల్లంకొండ : ఎమ్మెల్యే నంబూరు శం కరరావు సమక్షంలో మండ లంలోని పాపాయ పాలానికి చెందిన బెల్లం కొండ మండల టిడిపి మాజీ అధ్యక్షులు బత్తుల వెంకట్రావు , టీడీపీ చెందిన 35 కుటుంబాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. క్రోసూరు లోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారికి కండువాలు కప్పిన ఎమ్మెల్యే, పార్టీలోకి వారిని ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో బెల్లంకొండ మండల టిడిపి మాజీ అధ్యక్షులు బత్తుల వెంకట్రావు, చల్లా ఏడుకొండలు,తదితరులు ఉన్నారు.

హామీలు తక్షణం అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ యూనియన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బి . ముత్యాల రావు డిమాండ్ చేశారు. బుధవారం పొన్నూరు ఐలాండ్ సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడనుండి మున్సిపల్ కార్మికులందరూ కలసి ర్యాలీగా మున్సిపల్ ఆఫీసుకు చేరుకుని అనంతరం మున్సిపల్ ఆఫీసులో మేనేజర్ కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మకురి రమేష్ బాబు, మంగమ్మ, భూషమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి వైసిపి సీటు నాకే ఇవ్వాలి : కొసనం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి వైసిపి అసెంబ్లీ అభ్యర్థిగా తనకే సీటు ఇవ్వాలని మంగళగిరికి చెందిన కొసనం శ్రీనివాసరావు వైసిపి అధిష్టానాన్ని కోరారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్ ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక న్యాయం ప్రకారం తనకే సీటు ఇవ్వాలని, గంజి చిరంజీవి ఆ పదవికి అర్హుడు కాదని చెప్పారు. తక్షణమే చిరంజీవిని ఇన్‌ఛార్జి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. టిడిపిలో ఉన్నప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల దగ్గర నుంచి ప్రతి పనికీ డబ్బులు వసూలు చేసిన చిరంజీవిని తొలగించి పద్మశాలీయుల ఆత్మగౌరవం కాపాడాలని సిఎంను కోరారు. ఇప్పటికే ఆయన లోకేష్ కోవర్టు పని చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జి.బ్రహ్మేందరారెడ్డి, బి.వెంకటరమణకుమార్, పూజిత, ఎస్‌కె ఖలీల్ పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 16న దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలో భాగంగా తాడేపల్లి పట్టణంలో జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు వేముల దుర్గారావు కోరారు. మంగళవారం పోలకంపాడులోని లారీ స్టాండు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. 16వ తేదీ ఉదయం పది గంటలకు బాలాజీ గ్యాస్ కంపెనీ ఎదురుగా ఉన్న ఐఒసి కంపెనీ వద్దకు కార్మికులు, డ్రైవర్లు చేరుకోవాలని కోరారు. అక్కడ నుండి ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి:గత నెలలో మున్సిపల్ కార్మికులు సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను జిఒల రూపంలో పొందుపరిచి అమలు చేయాలని సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు కోరారు. మంగళవారం తాడేపల్లి ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికుల మస్తర్ పాయింట్ల వద్ద వారు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15వ తేదీ తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జిజిహెచ్‌లో రోగులకు పండ్లు, మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో లూజు మోషన్స్ తో చికిత్స పొందుతున్న రోగులకు వివిధ రకాలైన పౌష్టిక ఆహారాన్ని మంగళవారం నుంచి ప్రారంభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున వరకు పౌష్టికాహారాన్ని అందచేసినట్లు ఆయన చెప్పారు. పాలు,మజ్జిగ ప్రతి నాలుగు గంటలకు, పెరుగు అన్నం, పండ్లు, గోరు వెచ్చని మంచినీరు, రొట్టె, కోడిగుడ్డు, నిత్యం అందుబాటు లో ఉండేవిధముగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. వైద్యులు, వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. లూజు మోషన్స్ ఉన్న బాధితుల కోసం ప్రత్యేకంగా ఒక వార్డును కేటాయించామని, కొంతమంది చిన్నారులను చిన్న పిల్లల వార్డులో వైద్యం అందిస్తున్నామని అయన న్నారు. సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా ఉదయం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సంజీవయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య చిరస్మరణీయులని, 1921 ఫిబ్రవరి 14వ తేదీన కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్దిపాడులో ఒక దళిత కుటుంబంలో జన్మించారన్నారు. ఆయన రాష్ట్ర మంత్రిగా, అంధ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలు అందించారన్నారు. సమాజానికి వెనుకబడిన వర్గాలకు ఎంతో సేవ చేశారని, ప్రతి ఒక్కరు ఆయన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్‌ఒ పెద్ది రోజా, సోషల్ వెల్ఫేర్ డిడి మధుసూధన రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :ఎపి రెండో ముఖ్యమంత్రిగా తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేసిన దామోదరం సంజీవయ్య స్ఫూర్తిదాయకమైన జీవితం గడిపారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దర్శనపు సామ్యేలు అన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా మంగళవారం తాడేపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ప్రజాశక్తి పొన్నూరు రూరల్** :నేటి యువతకు ముఖ్యంగా ప్రజా జీవితంలో ఉన్న ప్రతీ ఒక్కరూ దామోదరం సంజీవయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి అని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కా రవీంద్రనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని పొన్నూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.

సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

జన రంజక కవిత్వం జాతికి అవసరం

ప్రజాశక్తి-గుంటూరు : జన రంజక కవిత్వం భారత జాతికి నేడు చాలా అవసరం అని వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక బందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం, అన్నమయ్య కళా వేదికపై మీద రావి రంగారావు సాహిత్య పీఠం నిర్వహించిన 'జన రంజక కవి ప్రతిభా పురస్కారాల సభ' లో పలువురు సాహితీవేత్తలు పాల్గొని ప్రసంగించారు. ఆధునికత పెరిగిన నేపథ్యంలో నూతన సమస్యల పరిష్కారం కోసం ప్రజల్ని చైతన్య పరిచే కవిత్వం చాలా అవసరం అని అన్నారు. వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభను దేవాలయ పాలక మండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య ప్రారంభించారు. పీఠం సంస్థాపకులు డాక్టర్ రావి రంగారావు మాట్లాడుతూ ప్రతి ఏటా కవిత్వ ప్రక్రియ ఏదైనా పుస్తకాలు ఆహ్వానించి, జన రంజక శైలిలో రాసిన పుస్తకాలను ఎంపిక చేసి కవులకు పురస్కారాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. గుంటూరు ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ మొండెపు ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తమ సాహిత్య ప్రచారం చాలా అవసరం అన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వి.పూర్ణచంద్ మాట్లాడుతూ కవులను ప్రోత్సహించటానికి రావి రంగారావు సాహిత్య పీఠం కృషిని కొనియాడారు. కవులు పాలపర్తి హవీలా (ఖమ్మం), పేరిసెట్ల శివకుమార్ (నెల్లూరు), రహీమొద్దీన్ (మహబూబాబాద్), కంచరాన భుజంగరావు (శ్రీకాకుళం), యాములపల్లి నరసిరెడ్డి (శ్రీ సత్య సాయి జిల్లా), డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ (గుంటూరు)ను సత్కరించి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సన్మాన కార్యక్రమాన్ని పాణిరావు యర్రగుంట్ల, డాక్టర్ మైలవరపు లలితకుమారి నిర్వంచగా, పింగళి భాగ్యలక్ష్మి, కొల్లూరి నాగేంద్రం, రావి రంగారావు సాహిత్య పీఠం కన్వీనర్ నర్రా ప్రభావతి, డైరెక్టర్ డాక్టర్ రావి అరుణ మొదలైనవారు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేసే వారికే మద్దతు

ప్రజాశక్తి - తుళ్లూరు: పాత ఫెన్షన్ విధానం అమలు చేయడంపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని తెలపాలని, ఒపిఎస్ అమలు చేసే వారికే తన మద్దతని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ ఆదినారాయణ చెప్పారు. వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన ఓట్ ఫర్ ఒపిఎస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద అన్ని రాజకీయపార్టీల అధ్యక్షులకు పోస్ట్ కార్డు రాసే కార్యక్రమం జరిగింది. నారాయణ మాట్లాడుతూ, పాత పెన్షన్ అమలు చేసే వారికే మరో రెండు నెలల్లో జరగ బోయే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు అని, సిపిఎస్ విధానంలో ఫెన్షన్ భద్రత ఉండదని,అందుకే ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక వర్గాలు ముక్తకంఠంతో ఒపిఎస్ అమలు చేయాలని,లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆర్ ఇందుమతి,పి శ్రీనివాసరావు,ఎస్ కె అబ్దుల్ ఖాసిం, వి ప్రసాద్, ఆర్ పుణ్యవతి, శశిరేఖ,అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

కెఎల్‌యు విద్యార్థికి రైఫిల్ షూటింగ్‌లో పతకాలు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్సిటీలో సిఎస్ ఐటి మూడవ సంవత్సరం చదువుతున్న మద్దినేని ఉమామహేష్ రైఫిల్స్ షూటింగ్‌లో రెండు బంగారు పతకాలు సాధించాడని క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. ఈ నెల 12నుండి 18వ తేదీ వరకు స్పెయిన్‌లో జరుగుతున్న పది మీటర్ల రూఫిల్ షూటింగ్‌లో జూనియర్ వరల్డ్ కప్ లో రెండు బంగారు పతకాలు సాదించి మువ్వన్నెల జెండాను అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేశాడని తెలిపారు. మద్దినేని ఉమామహేష్ లాగా బంగారు పతకాలను సాధిస్తూ మంచి పేరు తీసుకువస్తున్న విద్యార్థులకు నూరు శాతం ఫీజు రాయితీలు ఇస్తున్నామని పేర్కొన్నారు.

మదర్ థెరిస్సా ప్రైమరీ స్కూల్లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి తెనాలి : స్థానిక తెనాలి చిన్నరావు తోట 14 వ వార్డులో మదర్ థెరిస్సా ప్రైమరీ హై స్కూల్లో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్యం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షులు పల్నాటి నాగరాజు మాట్లాడారు. శిబిరంలో హ్యాపీ హాస్పటల్ సిబ్బంది డాక్టర్ అరుణ్ తేజ విద్యార్థులను పరీక్షించి, వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎ మరియదాసు, హాస్పిటల్ సిబ్బంది మంజునాథ్, రాజు, శేఖర్, సాంబశివరావు పాల్గొన్నారు.

10 మంది వ్యాపారులకు తోపుడు బళ్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి : నియోజకవర్గంలో పేద, బడుగు బలహీన వర్గాల వారికి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా సహాయ సహకారాలు చేస్తూ అండగా ఉంటారని మంగళగిరి పట్టణ టీడీపీ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు అన్నారు. మంగళగిరి పట్టణంలోని 9, 29, 30 వార్డులకు చెందిన పేదవారికి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సొంత నిధులతో తోపుడు బళ్లు తయారు చేయించి స్థానిక నాయకులు ద్వారా బుధవారం ఉచితంగా అందజేశారు.

బోర్డు డైరెక్టర్‌గా నవనీత్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి మంగళగిరి :నెహ్రూ యువ కేంద్రం అడ్వైజరి బోర్డు డైరెక్టర్గా మంగళగిరి పట్టణానికి చెందిన కొండ నవనీత్ కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మంత్రి అనురాగ ఠాగూర్ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా బుధవారం రాత్రి నవనీత్ కృష్ణారెడ్డి తెలిపారు

వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి :మంగళగిరి నియోజకవర్గ స్థాయిలో వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం రాత్రి పాత బస్టాండ్ సెంటర్లో గల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ. 33 కోట్ల 13 లక్షల 62 వేల 450 లు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వి విజయసాయిరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వివిధ శాఖల చెందిన అధికారులు పాల్గొన్నారు. కాగా ఆసరా కార్యక్రమానికి వచ్చిన మహిళలు కార్యక్రమం పూర్తయ్యేదాకా ఉండకుండా మధ్యలోనే వెళ్లిపోయారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

ప్రజాశక్తి దుగ్గిరాల

ఎన్నికలు సక్రమంగా సమర్ధవంతంగా నిర్వహించేందుకు నిబంధనలు కచ్చితంగా పాటించవలసి ఉంటుందని తాసిల్దార్ కే రవిబాబు అన్నారు. బుధవారం మండల స్థాయి బిఎల్‌ఒల కు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. మరణించిన వారి ఓట్లు తొలగించడానికి కచ్చితంగా కుటుంబ సభ్యులనే సంప్రదించాలన్నారు, మరణించిన వారు ఓట్లు తొలగించడానికి కలెక్టర్‌కు మాత్రమే అధికారం ఉంటుంది, అందువలన ఆధారాలతో కూడిన సమాచారం అందించవలసి ఉంటుందన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వవద్దని అలా జరిగితే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

ఎన్‌విఆర్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి తెనాలి

స్థానిక యన్.వి. ఆర్ కాలనీ సచివాలయ ంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహిం చారు. ఈ శిబిరంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల, డాక్టర్ వి మోనిక కుమార్, డాక్టర్ కె రాధిక, డాక్టర్ ఎం అనురాధ, డాక్టర్ సిహెచ్ దేవకి వైద్య సేవలు అందించారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ ఎ వెంకట కోటయ్య, ఏఎంఒ సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, వైద్య సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, ఎస్ ఉమాకాంత్, ఎం ఆశీర్వాదం, డి శ్రీనివాసరావు, యన్. లక్ష్మి, డి విజయకుమారి పాల్గొన్నారు.

ఘనంగా అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి స్టేషన్ రోడ్లోని శ్రీ అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం దేవస్థానం 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ కాలారి సుబ్బారావు, శ్రీమతి వసంత దంపతులు, భక్త బృందం ప్రతినిధులు మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత దంపతులు, కదం రాంబాబు, బావన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కంతేరులో వేలం

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని కంతేరు గ్రామ నర్సరీలో చెట్ల ఫలసాయమునకు సంబంధించిన వేలం పాటను కంతేరు గ్రామ నర్సరీలో నిర్వహించనున్నారని జిల్లా ఉద్యానవన శాఖాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి 24 సంవత్సరాలు కలిగిన 40 మామిడి మొక్కలు, 15 సంవత్సరాలు కలిగిన 180 మామిడి, 24 సంవత్సరాలు కలిగిన 40 సపోటా, 24 సంవత్సరాలు కలిగిన 50 కొబ్బరి మొక్కలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని, ధరావతు రూ.5 వేలు జిల్లా ఉద్యాన అధికారి, గుంటూరు వారిపేరు మీదగానీ, వేలం గంట ముందు నేరుగాగానీ చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర నియమ నిబంధనలన్నీ ఉద్యానవన అధికారుల ఆదేశాల మేరకు వర్తిస్తాయని ప్రకటించారు.

నేడు, రేపు ఆర్‌విఆర్‌లో 'కొలరిడో'

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి 39వ వార్షికోత్సవం ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్న సందర్భంగా గురు, శుక్రవారాల్లో 'కొలరిడో-2024' పేరుతో టెక్నికల్, సాంస్కృతికం, క్రీడల విభాగాలలో జాతీయ స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కొలరిడో పోటీల ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి, సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను పాల్గొంటారన్నారు. 17న కళాశాల వార్షికోత్సవానికి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అడ్వైజర్ ప్రొఫెసర్ వజ్జా సాంబశివరావు, సినీ హీరో తొట్టెంపూడి గోపిచంద్ పాల్గొంటారన్నారు. కళాశాలలో అర్హులైన 277 మంది విద్యార్థులకు రూ.20వేల చొప్పున రూ.55.44 లక్షల స్కాలర్‌షిప్‌లు అందచేయనున్నట్లు రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు: ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీ చైతన్యకు ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. లక్ష్మీచైతన్య 'రీ ఇన్ఫోర్స్డ్ గార్లెట్ అల్యూమినియం కాంపోసిట్ ఫర్ పిష్టన్ అప్లికేషన్' అనే అంశంపై ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పిహెచ్‌డి కలిగిన స్టాఫ్ మొత్తం 139 ఉన్నారని, పరిశోధనలను కళాశాల ప్రోత్సహిస్తుందని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. లక్ష్మీ చైతన్యకు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ వి.వి.కృష్ణప్రసాద్ అభినందనలు తెలిపారు.

చలపతి ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో బుధవారం చెన్నైకు చెందిన ఎపిసోర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ బి.ఫార్మశీ, యం.ఫార్మశీ, ఫార్మాడిలో అర్హత విద్యార్థులకు మెడికల్ కోడింగ్ విభాగంలో ఉద్యోగం కోసం ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికను కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ విజయ్‌రామన్, రమేష్ హాజరై నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఈ ఎంపికలకు కళాశాల నుండి 97 మంది హాజరు కాగా, 24 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. వీరు రూ.2.1 లక్షల నుండి రూ.2.4 లక్షల వార్షిక వేతనం పొందుతారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ రామారావు అభినందించారు.

విజ్ఞాన్స్‌లో ఇండస్ట్రీ అకడమియా ఇంటరాక్షన్ ప్రోగ్రామ్

హాజరైన అధ్యాపకులతో అతిథులు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి, విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'ఇండస్ట్రీ అకడ మియా ఇంటరాక్షన్ ప్రోగ్రామ్' ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంకాక్‌లోని అపారి (ఆసియా-ఫసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్) ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను అధ్యాపకులతో మాత్రమే కాకుండా ఇండ్రస్ట్రీ ప్రముఖులతో బోధిస్తే సాంకేతికంగా ఉత్తమ ఫలితాలను రాబట్టువచ్చని పేర్కొన్నారు. ఇండస్ట్రీలతో ఎక్కువగా అవగాహన ఒప్పందాలను ఏర్పరుచుకుంటే విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ స్కిల్స్ అందించడంతో పాటు ఇంటర్న్‌షిప్స్‌కు పంపించడానికి వీలుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీల్లో అభ్యర్థుల కొరత ఎక్కువగా ఉందని, నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ అగ్రికల్చర్ విద్యనభ్యసించే విద్యార్థులు రైతులకు అవసరమైన రీసెర్చ్ టెక్నాలజీని అందించి, మార్కెటింగ్ మెలుకువలను నేర్పించాలన్నారు.కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ మాజీ సైంటిస్ట్ డాక్టర్ కేపీసీ రావ్, హైదరాబాద్‌లోని ఎన్ఐపీహెచ్ఎం జాయింట్ డైరక్టర్ డాక్టర్ కేపీ విధు, ఖరగ్‌పూర్‌లోని ఐఐటీ ప్రొఫెసర్ పీ.శ్రీనివాసరావ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ పాల్గొన్నారు.

మలినేనిలో కృత్రిమ మేధపై శిక్షణ

కొల్లా అశోక్‌బాబును సన్మానిస్తున్న మలినేని పెరుమాళ్లు

ప్రజాశక్తి-గుంటూరు : మలినేని పెరుమాళ్ళు విద్యా సంస్థల్లో సిఎస్ఈ, అనుబంధ బ్రాంచిలకు హాక్‌బోట్స్ ఆధ్వర్యంలో ఈనెల 19వ వరకూ నిర్వహిస్తున్న 'ఏఐ ఇన్నోవేటివ్ స్ప్రింట్' టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి మలినేని విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం.పెరుమాళ్లు,ఎన్ఆర్ఐ, తానాజ సెక్రెటరీ కొల్లా అశోక్‌బాబు, హాక్‌బోట్స్ సిఈఒ మహాన్ పాల్గొన్నారు. ముఖ్య అతిథి కొల్లా అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత ట్రెండింగ్ టెక్నాలజీపై అమెరికాలో ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. అమెరికా వచ్చే విద్యార్థులకు తమ వంతు సాయం అందిస్తామన్నారు. మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు ట్రెండింగ్ టెక్నాలజీ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో పట్టు సాధించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసకుమార్, డీన్ పి.రమేష్‌బాబు, సిఎస్ఈ హెడ్ డాక్టర్ డి.రవికిరణ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం జనవరి 23వ తేది నుండి ఫిబ్రవరి 13వ తేది వరకు అందిన క్లైమ్‌లను పరిశీలించి, పరిష్కరించాల్సి వుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్ఒ పెద్దిరోజా, ఆర్డిఓ పి.శ్రీఖర్‌తో కలిసి ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఆప్ నుండి డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నుండి సిహెచ్.వాసు, బిజెపి నుండి ఆర్.భాస్కరరావు, సిపిఐ(యం) నుండి వై.కృష్ణకాంత్, కాంగ్రెస్ నుండి బి.సునీల్, టిడిపి నుండి కె.శివరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం జనవరి 23 వ తేది నుండి ఫిబ్రవరి 13 వ తేది వరకు ఫారం -6 క్రింద 9,733, ఫారం -6 ఏ క్రింద 29 , ఫారం -7 క్రింద 8,394 , ఫారం -8 క్రింద 20,470 క్లైమ్స్ అందాయన్నారు. కొత్తగా వచ్చిన ఈ క్లైమ్స్‌ను ఈఆర్ఓలు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఫారం -8 క్రింద ఇతర నియోజకవర్గాల నుండి నివాసం మార్చడం లేదా దిద్దుబాటు కొరకు అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని వీటిపై ప్రత్యేక దష్టి పెట్టాలని, అలాగే ఫారం -6 క్రింద 30 సంవత్సరాల పైబడి వయస్సు వున్న ఓటర్ల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో కోరారు. ఓటర్ల జాబితాపై వచ్చిన వ్యతిరేక వార్తలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో పేద, మధ్యతరగతి వర్గాలకు నిరాశ

మాట్లాడుతున్న వివికె.సురేష్

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్థిక వ్యవస్థ గురించి గణాంకాలు తప్ప, అధిక ధరలు, ఉపాధి కొరత, ఆర్థిక అసమానతలు వంటి అనేక ముఖ్యమైన సమస్యలకు సరైన పరిష్కారాలను కేంద్ర బడ్జెట్ సూచించలేదని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె. సురేష్ అన్నారు. బుధవారం స్థానిక విద్యానగర్‌లోని ఎల్ఐసి మీటింగ్ హాలులో జి.శివరామకష్ణ అధ్యక్షతన 'కేంద్ర బడ్జెట్ - విశ్లేషణ'పై స్టడీ సర్కిల్ జరిగింది.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 'ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధులను కేటాయించలేదని, పట్టణ ఉపాధి ప్రస్తావన లేదన్నారు. మధ్య తరగతి వర్గాలకు ఈసారి కూడా ఆదాయపన్ను రాయితీల విషయంలో నిరాశ ఎదురైందన్నారు. పొదుపును ప్రోత్సాహించే ప్రతిపాదనలు లేవని, వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ చేపట్టాలని ప్రతిపాదించారని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేదన్నారు. భారీ అప్పుల ఊబిలో మన ఆర్థిక వ్యవస్థ చిక్కుకున్నదని, 2025 మార్చి నాటికి అంతర్గత రుణాలు రూ.177.92 లక్షల కోట్లకు చేరుకుంటాయని అంచనా వేశారని అన్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు అవసరమైన నిధులు ఈసారి కూడా కేటాయించలేదని, ప్రైవేటు యూనివర్సిటీలకు ప్రోత్సాహం ఇస్తున్నారని, చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపారులను కాపాడే నిర్దిష్ట చర్యలు లేవని, జిఎస్‌టి భారాల వల్ల లక్షలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి అన్యాయం చేశారు..విభజన చట్టం హామీల అమలు గురించి మాట్లాడలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపుతామని చెప్పలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.సైదులు, పి.ఆర్.రాజశేఖర్, సి.హెచ్.మధుబాల, జి.భాస్కరరావు, టి. రామలింగేశ్వరరావు, పి.వి.టి.శ్రీనివాస్, ఎమ్.ఎస్.భార్గవి, మాధవీలత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌జెడి

పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాలి : ఆర్‌జెడి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ పాఠశాలలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉంచాలని నూతన ఆర్‌జెడి ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి అన్నారు. పాత బస్టాండ్ వద్ద పరీక్షా భవన్‌లో బుధవారం గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ విద్యాబోధన విషయంలో రాజీ పడవద్దని, విద్యాభివద్ధికి విస్తత కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. విద్యాశాఖలో జరుగుతున్న కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. పాఠశాలల్లో ఐఎఫ్‌పీలను పూర్తిస్థాయిలో వినియోగించడంతో పాటు, 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ఐఎఫ్‌పీల ఇన్‌స్టలేషన్‌కు ముందుగా పాఠశాలల్లో విద్యుద్దీకరణ ఉండేలా చూడాలన్నారు. ఎంఈవోలు ప్రతిరోజూ ఒక పాఠశాలను ఖచ్చితంగా సందర్శించాలని, పాఠశాలలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత పెరగాలన్నారు. పాఠశాలల సందర్శన సమయంలో విద్యార్థుల ప్రగతిపై పరిశీలన చేయాలన్నారు. డిఇఒ పి.శైలజ మాట్లాడుతూ టెన్త్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఎంఈవోలు పాఠశాలల సందర్శన సమయంలో ఉపాధ్యాయులు వారికి సహకరించాలని, ఎంఈవో-1, ఎంఈవో-2 అనే బేధాల్లేకుండా ఇద్దరిలో ఎవరైనా పాఠశాలలను సందర్శించవచ్చని అన్నారు. సమావేశంలో సమగ్రశిక్ష ఎపిసి జి. విజయలక్ష్మి, గుంటూరు, తెనాలి డీవైఈవోలు పి.వెంకటేశ్వరరావు, ఎం.నిర్మల, గుంటూరు ఈస్ట్ ఎంఈవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డాక్టర్ సేవాకుమార్ తదితరులు

ఓటరు చైతన్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు ఓటు హక్కు విలువ తెలుసుకొని, ప్రలోభాలకు లోనుకాకుండా ఎన్నికలలో సమర్థుల్ని, మంచి వ్యక్తుల్ని ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షింపబడుతుందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఒ సమావేశ మందిరంలో ఆప్ 'ఓటరులారా..ఓటు వేసే ముందు..ఆలోచించండి' పేరుతో ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల్లో సరైన అభ్యర్థులను ఎన్నుకోకపోతే దేశానికి, రాష్ట్రానికి జరిగే నష్టం అంతా ఇంతా కాదన్నారు.ప్రతి ఓటరు ప్రస్తుత దేశ, రాష్ట్ర పరిస్థితులను చర్చించాలని, విజ్ఞత ప్రదర్శించి, విచక్షణతో ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జై ఆంధ్ర మహదేవ్, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడారు.

ఘనంగా తులసి ధర్మచరణ్ పుట్టినరోజు వేడుకలు

కేక్ కట్ చేస్తున్న తులసి ధర్మచరణ్

ప్రజాశక్తి-గుంటూరు

వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ జన్మదిన వేడుకలు స్థానిక అరండల్ పేటలోని వేద సీడ్స్ ఆఫీసులో వైభవంగా నిర్వహించారు. ఆఫీసు సిబ్బంది, సన్నిహితులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ధర్మచరణ్ కట్ చేశారు. ఈ సందర్భంగా వేద సీడ్స్ యండి. డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కష్టం, స్వయంకృషికి మారుపేరు ధర్మచరణ్ అని, పట్టుదలే ఆయన విజయమని, చిన్న వయస్సు నుంచే సేవను తన ఇంటి పేరుగా మార్చుకొని, ఏంతో మంది పేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థికంగా వెన్నంటే ఉంటున్నారన్నారు. ధర్మచరణ్ సన్నిహితులు, హోటల్ సుభానీ నిర్వాహకులు తాడి శ్రీనివాస్, తిమ్మిశెట్టి కళ్యాణ్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం, భ్రమరాంబపురం కాలనీలోని లీమా ఆశ్రమ పాఠశాలలో చిన్నారులకు అన్నదానం చేశారు. రెడ్డిపాలెంలోని మానవతా వద్ధాశ్రమంలో డొంకెన మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆర్ఆర్‌కె క్యాటరర్స్ అధినేత రేజేటి రామకృష్ణ ఆధ్వర్యంలో నల్లచెరువులో నిరాశ్రయులకు అన్నదానం చేశారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ తనపై చూపుతున్న ప్రేమానురాగాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, తాను తలపెట్టే సామాజిక, సాంఘిక, రాజకీయ పనులలో తనతో తోడుగా వస్తున్న వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తానెప్పుడు మెగాస్టార్ చిరంజీవి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు విధేయుడుగా ఉంటానని, 2024 ఎన్నికల్లో పోటీ చేయాలని తనను నిర్దేశిస్తే ఖచ్చితంగా గెలిచి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ కంఠా జగదీష్, సుంకర సతీష్, చెన్నంశెట్టి శివ, ఆంజనేయులు, కన్నసాని బాజి తదితరులు పాల్గొన్నారు.